క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కాటారం: భార్య మృతి చెందగా పిల్లలు దూరంగా ఉంటున్నారనే మనస్తాపంతో వలస కూలీ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘన మండలంలోని గారెపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామాంజపూర్(గుంటూరుపల్లి) గ్రామానికి చెందిన ధర్మలా వెంకటమల్లు అలియాస్ వెంకట్(38) గత కొన్నేళ్లుగా మేస్త్రి పని చేస్తూ పరకాలలో ఉంటున్నాడు. గత ఏడాది భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో భార్య ఇందు పురుగుల మందు మృతి చెందింది. వారికి కూతురు, కుమారుడు ఉండగా వారు అమ్మమ్మ ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ క్రమంలో గత ఆరు నెలల క్రితం వెంకట్ పని కోసం గారెపల్లికి వచ్చాడు. తాను అద్దెకు ఉంటున్న గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. భార్య మృతి చెందడంతో పాటు పిల్లలు, కుటుంబ సభ్యులు దూరంగా ఉంటున్నారని వెంకట్ పదే పదే బాధపడేవాడని సోదరుడు రాజు తెలిపారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

మొగుళ్లపల్లి: రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలను, వైర్లను చేతులతో తాకవద్దని స్థానిక ఎస్సై అశోక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాల్వలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు మత్స్యకారులు, ప్రజలు చేపల వేటకు వెళ్లవద్దని తెలిపారు.

రైతుబీమా దరఖాస్తుకు అవకాశం

కాటారం: కొత్తగా పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు, గతంలో రైతుబీమా చేసుకోని రైతులు 2024 సంవత్సరానికి సంబంధించి రైతు బీమా చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి గిరి రామకృష్ణ తెలిపారు. రైతులు రైతుబీమా నామినేషన్ ఫారం, పట్టాదారు పుస్తకం, పట్టాదారు, నామిని ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు తీసుకొని స్వయంగా సంబంధిత ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. ఆగస్టు 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

30లోగా రైతుబీమా చేయించుకోవాలి

వెంకటాపురం(కె) : ఈ నెల 30లోపు కొత్తగా పాస్‌బుక్ పొందిన రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించి రైతు బీమా చేయించుకోవాలని శనివారం మండల వ్యవసాయ అధికారి గుంటక నర్సింహారావు తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కన్నాయిగూడెం: మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల పేర్లతో హెచ్చరిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలోని దొంగల గుట్టవాగు, బుట్టాయిగూడెం వాగులతో పాటు మరికొన్ని వాగుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరు వరదల వైపు రాకుడదని భారీ వర్షాలు కురుస్తున్నందున ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని, వరద ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో దిగరాదని ఏర్పాటు చేశారు.

మల్హర్: మల్లారం ఆరెవాగులో పెరిగిన వరద నీరు



కాటారం: గుండ్రాత్‌పల్లి అలుగువాగు వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



ఉప్పొంగుతున్న వాగులు

గత మూడు రోజుల నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. వరదనీరు చెరువులు, వాగులకు చేరడంతో జలకళను సంతరించుచున్నాయి. భారీగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రైతులు పంటపొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు, అధికారులు ఆయా ప్రదేశాల్లో సందర్శించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అధికారులు ముందస్తు జాగ్రత్తగా ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

- సాక్షి, నెట్‌వర్క్



కాటారం: ఎస్సీ కాలనీలో నిలిచిన నీటిని తీయిస్తున్న కార్యదర్శి





మల్హర్: ఉధృతంగా ప్రవహిస్తున్న తాడిచర్ల మానేరు, మహాముత్తారం : నిమ్మగూడెంలో దారికి అడ్డంగా పడ్డ చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



కాటారం: వాగుల వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



కాళేశ్వరం : పెద్దంపేట వద్ద వాటర్‌బోట్ పనితీరు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



మహాముత్తారం: పెగడపల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్

గంజాయి సేవిస్తున్న వ్యక్తుల అరెస్ట్

వాజేడు: గంజాయి సేవిస్తున్న ఐదుగురు మైనర్లతో కలిపి 8 మందిని అరెస్ట్ చేసినట్లు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని చంద్రుపట్ల వద్ద కొంత మంది నిషేధిత గంజాయి సేవిస్తున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తన సిబ్బందితో అక్కడి వెళ్లారు. అనుమానాస్పదంగా కనిపించిన 8 మంది అక్కడి నుంచి పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని వివరాలను సేకరించారు. ఇందులో ఐదుగురు మైనర్లు ఉన్నారు. మరో ముగ్గురు టేకులగూడేనికి చెందిన జవ్వ గణేష్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కనుకునూరు గ్రామానికి చెందిన మారబోయిన శివరామకృష్ణ, దాట్ల శ్రావణ్ కుమార్ ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి 168 గ్రాముల గంజాయి, స్మార్ట్‌ఫోన్లు 7, కీ ప్యాడ్ ఫోన్ 1 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు వెళ్లొద్దని గంజాయి లాంటి మత్తుపదార్థాల వైపు వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని సీఐ సూచించారు.



వాజేడు: నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ కుమార్

చెరువులను సందర్శించిన అధికారులు

చిట్యాల: మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని నవాబుపేట, వెంకట్రావుపల్లి(సీ), చైన్‌పాక, నైన్‌పాక, ఏలేటిరామయ్యపల్లి, చిట్యాలతో పాటు పలు గ్రామాల్లోని చెరువులను, కుంటలను, వాగులను స్థానిక తహసీల్దార్ ఎండీ.ఖాజామోహియోద్దీన్, ఎంపీడీఓ జయశ్రీ, ఎంపీఓ రామకృష్ణ, ఐబీ ఏఈ దిలీప్‌లతో కలిసి పరిశీలించారు. మండలంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పలు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ముందస్తుగా అధిక వర్షాలు కురుస్తే తక్షణమే సహాయ చర్యలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఖాజామోహియోద్దీన్, ఎంపీడీఓ జయశ్రీ

లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు

ములుగు రూరల్: వ్యాపారులు లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే, జీఎస్టీ లైసెన్స్ లేకుండా ఉండడం చట్టరీత్యా నేరమని వాణిజ్యపన్నుల శాఖ ములుగు సర్కిల్ సీటీఓ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని వ్యాపార సముదాయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ లైసెన్స్‌ల జారీ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని అన్నారు. వ్యాపారులు క్రయవిక్రయాలను తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. జీఎస్టీ లైసెన్స్ లేనివారు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏసీటీఓ నవీన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న సీటీఓ తిరుపతిరెడ్డి

అత్యవసరమైతేనే బయటకు రావాలి

టేకుమట్ల: భారీ వర్షాల దృష్ట్యా మండల ప్రజలు అత్యవసర సమయంలో మాత్రమే బయటకు రావాలని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ముంపు ప్రాంతాలు, మానేరు, చలివాగు ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపిలేని భారీ వర్షాలతో వాగులు, చెరువులు నిండుకుని ప్రవహిస్తున్నాయి. ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. మానేరు, చలివాగు దాటేవారు లోతు ఎక్కువగా ఉంటే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. నీటి ఉధృతిని అంచనా వేస్తూ దాటాలన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు పూర్తిగా వర్షంతో తడిసి ఉన్నందున రైతులు వ్యవసాయ బావులతో మోటార్లు, స్టార్టర్లు, విద్యుత్ స్తంభాలను నేరుగా ముట్టుకోరాదని సూచించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ తుల రమేశ్, కానిస్టేబుళ్లు మహేందర్, సుమన్, నాగరాజు, హోంగార్డు రాజయ్యలు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మల్హర్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ తెలిపారు. మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాలైన కొయ్యూరు పీవీనగర్, వల్లెకుంట, కుంభంపల్లి గ్రామాలను శనివారం వారు పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప గ్రామస్తులు బయటకు రావద్దని సూచించారు. అత్యవసర సమయంలో రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని వారికి వివరించారు.



రాఘవాపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

ఏఎన్‌ఎం కుటుంబాన్ని ఆదుకోవాలి

కాటారం: మహాముత్తారం మండలం రెండో ఏఎన్‌ఎంగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన చిడం ముత్తక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీశ్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రెండో ఏఎన్‌ఎంలు వర్షంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా రెండో ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వర్తిస్తున్న వీరిని ప్రభుత్వాలు రెగ్యులర్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలు మారుతున్నా ఏఎన్‌ఎంల బ్రతుకులు మారడం లేదన్నారు. ముత్తక్క కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని సతీశ్ హెచ్చరించారు. అంతకముందు ముత్తక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు సరళ, శ్యామలత, పార్వతి, విజయ, సునీత, సుజాత, భారతి, సంధ్య, వెంకటమ్మ, స్వప్న, రజిత, పీహెచ్‌సీల్లో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



కాటారంలో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, రెండో ఏఎన్‌ఎంలు

పిల్లలను అంగన్‌వాడీలకు పంపించాలి

టేకుమట్ల: ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజ అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని రామకిష్టాపూర్(టి), అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని శనివారం అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం, సామూహిక సీమంతాలు, వనమహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటలు, పాటలతో విద్యాభ్యాసాన్ని అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, భాగ్యలక్ష్మి, తిరుపతమ్మ, వనిత, సరిత, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని టీచర్లు ఒద్దె ఉమామహేశ్వరి, మచ్చ శైలజ నిర్వహించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆలోచన శక్తిని పెంపొందించాలి

చిట్యాల: అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న పిల్లలందరికీ ఆలోచన శక్తిని పెంపొందించాలని ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రఘుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రానికి వస్తున్న పిల్లలందరికీ రుచికరమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. అలాగే చిన్నపిల్లలను ప్రైవేట్‌పాఠశాలలో చేర్పించడం మూలంగా తల్లి దండ్రులకు డబ్బుతో పాటు సక్రమంగా భోజనం చేయక అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలకు పంపించినట్లయితే సమయానుకూలంగా అన్నిరకాల కార్యక్రమాలు చేయించి పాఠశాలలోని విద్యార్థులకు వేడి వేడి భోజనంతో పాటు నాణ్యతమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ముగ్గురి పిల్లలకు అక్ష్యరాభ్యాసం, ఐదుగురికి ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు ఇచ్చి ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయప్రద, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు చింతల సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, అరుణ, భాగ్యమ్మ, సుజాత, మహిళలు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: రెండున్నర ఏళ్ల వయస్సు ఉండి ఐదేళ్లలోపు ఉన్న పిల్లలను ప్రీ ప్రైమరీ విద్యకోసం అంగన్‌వాడీల్లో చేర్పించాలని, తర్వాత ప్రాథమిక స్కూళ్లలో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. మండలంలోని కాసులపహాడ్ అంగన్‌వాడీ పాఠశాలలో శనివారం అమ్మమాట-అంగన్‌వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారం, బాలామృతం, కోడిగుడ్లు, పోషక విలువలతో కూడిన ఆహారం అందించి పిల్లల్లో నైపుణ్యం పెంపొదించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడి టీచర్ సునిత, అయా విజయ, ఆశ కార్యకర్తలు, పిల్లలు పాల్గొన్నారు.



చిట్యాల : పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం రఘుపతి



టేకుమట్ల : సుబ్బక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మొక్క నాటుతున్న అంగన్‌వాడీ టీచర్ స్వప్న



కాళేశ్వరం: అన్నప్రాసన చేస్తున్న టీచర్లు



మొగుళ్లపల్లి : కాసులపహాడ్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ మాధవి

వానాకాలం.. జరభద్రం

- విద్యుత్ వైర్లను సరి చేసుకోవాలి
- సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి
- జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

మొగుళ్లపల్లి : వర్షాకాలంలో విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వర్షంతో పాటు గాలి వీచే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు ఉన్న చోట యంత్రాలతో దుక్కిదున్నే క్రమంలో రైతులు పొరపాటున స్తంభాలను తాకినట్లయితే ప్రమాదాలు జరగవచ్చు. పంట చేలలోని విద్యుత్ మోటార్లకు అందించే విద్యుత్ తీగలు కింద వేలాడినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించి తీగలను సరి చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

విద్యుత్ మోటార్లు బిగించే క్రమంలో..

పంటలు సాగుచేసే ప్రతి రైతు వేసవిలో మోటార్లను తీసేసి వర్షాలు పడే సమయంలో విద్యుత్ మోటార్లను అమర్చే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులే మరమ్మతులు చేస్తూ ఉంటారు. దీంతో మోటార్లు కాలిపోయే ప్రమాదం ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దని అధికారులు చెబుతున్నారు.



సబ్‌స్టేషన్..

పంటల రక్షణకు విద్యుత్‌ను వాడొద్దు

పంటలు చేతికొచ్చే సమయంలో కొంతమంది రైతులు పంట చుట్టూ ఇనుప వైర్‌ను ఏర్పాటు చేసి దానిని విద్యుత్‌కు అనుసంధానం చేస్తారు. దీంతో జంతువుల బారి నుంచి పంటలు కాపాడుకోవచ్చు. కానీ అది చాలా ప్రమాదం, ఇదే సమయంలో రైతులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి......

- వర్షాలు పడేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్లకింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలబడొద్దు..
- రోడ్డు మీదగానీ, నీటిలో కాని విద్యుత్ తీగపడి ఉన్నట్లు గుర్తిస్తే తీగను తొక్కకూడదు. వాటిపై నుంచి వాహనాలు నడపకూడదు.
- చెట్ల కొమ్మలపై, భవనాలపై తెగిపడ్డ తీగలు ఉన్నట్లయితే వాటిపై అప్రమత్తంగా ఉండాలి.
- విద్యుత్ తీగ తెగిపడినట్లుగా గుర్తిస్తే వెంటనే మీ సమీప సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి.

అవగాహన కల్పించాలి....



పంట పొలాల్లో విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. వర్షాకాలంలో విద్యుత్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నాం. రైతులు వినియోగించే మోటార్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి రైతులను అప్రమత్తం చేయాలి.

కృష్ణారెడ్డి, రైతు

అధికారులను సంప్రదించాలి



రైతులు వర్షాకాలం నేపథ్యంలో సొంతంగా మరమ్మతులు చేపట్టకుండా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించాలి. లేనిచో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు చిన్నపాటి పొరపాటు కూడా చేయొద్దు.

-ప్రమోద్ విద్యుత్ ఏఈ, మొగుళ్లపల్లి

రెడ్డిగాండ్ల సంఘం కమిటీ ఎన్నిక

మల్హర్: మండలంలోని వల్లెకుంట, కొయ్యూరు రెడ్డిగాండ్ల సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాఘవరెడ్డి, అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాపురెడ్డి, కోశాధికారిగా స్వామి, ఆర్గనైజర్‌గా చందులను ఎన్నుకున్నారు.



సంపత్‌రెడ్డి

నేడు గురుపౌర్ణమి వేడుకలు

గణపురం : మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వినయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ-కాగడహారతి, 6 గంటలకు శ్రీ సాయినాథుడికి మంగళస్నానం, సంస్థాన పూజ, ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తర శత నామార్చన, సహస్రనామార్చనలు, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, తీర్థప్రసాద వితరణ, ఒంటి గంటకు మహాన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు అష్టోత్తర శత నామార్చన, 6.15 నిమిషాలకు సంధ్యహారతి, రాత్రి 8 గంటలకు పల్లకిసేవ, 8.45 నిమిషాలకు శేజ హారతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేడుకలకు ఆలయ ధర్మకర్త జెడ్పీటీసీ గండ్ర పద్మ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణ రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సాయినాథుని ఆశీస్సులు పొందాలన్నారు.

రుణమాఫీ చేసిన ప్రభుత్వంపై హర్షం

కాళేశ్వరం: తెలంగాణ రాష్ట్రంలో రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా 2022 మే 6న వరంగల్ బహిరంగ సభలో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్‌లో, 2023 సెప్టెంబర్ 17న కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఇచ్చిన హామీలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలి విడతలో లక్షలోపు రుణమాఫీకి డబ్బులు విడుదల చేయడం శుభపరిణామం అన్నారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు సంకెళ్లను వేసి కేసులు నమోదు చేసి రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. ఎన్నికల హామీలో భాగంగా హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తి చేసి కాంగ్రెస్ మాటే శిలాశాసనం అని నిరూపించిందని హర్షం వ్యక్తం చేశారు.